క్లుప్తంగా

పెరిగిన గోదావరి నీటిమట్టం



ములకల్లంక, బొబ్బిల్లంక మధ్య గోదావరిలో వేసిన రోడ్డుపై నీరు

సీతానగరం: గోదావరి నీటిమట్టం పెరగడంతో మండలంలోని ములకల్లంక, బొబ్బిల్లంక గ్రామాల మధ్య ఆదివారం ఉదయం రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య నదిలో నిర్మించిన రోడ్డు కొంతమేర మునిగిపోయింది. అయితే సాయంత్రానికి ఉధృతి స్వల్పంగా తగ్గడంతో ఆ దారిలోనే స్థానికులు రాకపోకలు ప్రారంభించారు. ఏటా గోదావరి వరద తగ్గుముఖం తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఈ రోడ్డును పంచాయతీ అధికారులు ఏర్పాటు చేస్తారు. ములకల్లంక వాసులు బయట గ్రామాలకు, అలాగే బొబ్బిల్లంక రైతులకు చెందిన లంకభూముల పనులకు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు జరుపుతారు. ములకల్లంక గ్రామస్తులకు రెండు మరపడవలు ఉన్నాయి. వరద సమయంలో వీటిపై ప్రయాణిస్తారు.

చంద్రశేఖర స్వామికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి ఆదివారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు జరిగాయి. మాస శివరాత్రి సందర్భంగా ఈ అభిషేకాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సారా బట్టీలపై ఎస్‌ఈబీ దాడులు



దాడిలో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఈబీ సిబ్బంది

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో సారా బట్టీలపై ఆదివారం ఎస్‌ఈబీ సిబ్బంది దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణునిపాలెం గ్రామ శివారున సారా తయారు చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు కోరుకొండ ఎస్‌ఈబీ ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రెండు బైక్‌లు, 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రంప యర్రంపాలేనికి చెందిన గందం మరిదయ్య, గందం అర్జు, కేతా ఈశ్వరరావు, ఓరుగళ్ల సూర్యచంద్రంలను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై సత్యానారాయణ వివరించారు.

చురుకుగా సాగు పనులు



వడిశలేరులో కళకళలాడుతున్న నారుమడి

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో వర్షాలు కురవడం వల్ల ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరిసాగుకు భూములను దుక్కులు దున్ని నారుమడులు వేస్తున్నారు. మరి కొందరు రైతులు దమ్ములు చేసి వెదజల్లే పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని చంద్రుడు, పెదరాయవరం, రంగంపేట, వడిశలేరు తదితర గ్రామాల్లో సాగు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం రాయితీపై విత్తనాలను రైతులకు అందించడంతో ఇప్పటి వరకు సుమారు 820 ఎకరాల్లో నారుమడులు, 60 ఎకరాల్లో వెదజల్లు వేశారు. ఖరీఫ్ పనులకు వాతావరణం అనుకూలించడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. బోర్ల వద్ద ముందుగా వేసిన నారు మడుల ఆకు ఎదగడంతో అక్కడ రైతులు దమ్ములు చేసి వరినాట్లు వేస్తున్నారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో అధికారులు సిద్ధం చేశారు.

మహిళ అదృశ్యం

బిక్కవోలు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొమరిపాలెం గ్రామానికి చెందిన కాదా సింహాచలం తన కూతురు అంజారి లక్ష్మీసత్యకుమారికి గోపాలపురానికి చెందిన బాలమురళీకృష్ణతో వివాహం చేశారు. వారిద్దరు కొంత కాలంగా కొమరిపాలెంలోనే ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే గత నెల 29 తేదీన ఇంటి నుంచి బయటి వెళ్లి సత్యకుమారి కనిపించడంలేదని ఆమె తల్లి ఫిర్యాదు చేశారు. పాలకొల్లు చెందిన రవితేజపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

జనసేన ఇన్‌చార్జిగా బలరామకృష్ణ

మధురపూడి: జనసేన పార్టీ రాజానగరం ఇన్‌చార్జిగా బత్తుల బలరామకృష్ణ నియమితులయ్యారు. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన ఆయన కొంత కాలంగా జనసేనలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చింది.

పల్లెకొచ్చి.. పరీక్షలు చేసి..

- గ్రామీణులకు చేరువైన వైద్య సేవలు
- సత్ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో బాగంగా పెదపూడిలో వైద్య సేవలు అందిస్తున్న పెద్దాడ పీహెచ్‌సీ వైద్యులు సురేఖ

పెదపూడి: పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రతి గ్రామంలోను మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు, ప్రభుత్వ డాక్టర్‌తో పాటు సిబ్బంది 104 వాహనం ద్వారా వచ్చి వైద్య పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. గతంలో పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం ప్రజలకు భారంగా ఉండేది. దాని వల్ల రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే సేవలు

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులు వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. వీటితోపాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. పెదపూడి మండలంలో పెద్దాడ, సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెదపూడిలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. 104 వాహనాలు రెండు, ఇద్దరు వైద్యులు, 8 మంది సిబ్బంది రోజుకు సగటున రోగుల సంఖ్య 245 చొప్పున వైద్య సేవలు అందిస్తున్నారు.

67 రకాల మందులు

కొత్త వైద్య విధానంలో భాగంగా ఇంటి వద్దకే పరీక్షలు నిర్వహిస్తున్నారు. 104 వాహనంలో మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యులు సూచనలు మేరకు రక్తపరీక్షలు చేపడతారు. అలాగే అనారోగ్య సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 67 రకాల మందులు సిద్ధం చేశారు

ప్రజలకు మెరుగైన వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ విషయంలో సీఎం జగన్ రాజీలేని నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే కార్పొరేట్ వైద్యం ప్రతి ఒక్కరికీ చేరవుతోంది. దాదాపు 4 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్యసేవలు పొందే అవకాశం కల్పించడం విశేషం. నాడు–నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రిల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పనకు నడుం బిగించారు. ఏళ్ల తరబడి ఖాళీ ఉన్న వైద్యులు, వైద్యసిబ్బంది పోస్టులను భర్తీ చేశారు.

104 వాహనం ద్వారా అందిన సేవలు

వైద్య పరీక్షలు	: 25492
జనరల్ ఓపీ	: 12246
గర్భిణులు	: 1182
బాలింతలు	: 807
బీపీ	: 4291
షుగర్	: 3648
రక్తహీనత	: 73
నోటి క్యాన్సర్	: 4
టీబీ	: 24
బోద	: 17

అందుబాటులో వైద్యం



మా ప్రాంతానికి నెలకు రెండు సార్లు 104 వాహనం వస్తోంది. బీపీతోపాటు ఇతర సమస్యలను డాక్టర్ పరీక్షించి మందులు ఇస్తున్నారు. అంతేకాకుండా సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. దీని ద్వారా ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– వి.నాగరత్నం, పెదపూడి గ్రామం

ముందస్తు సమాచారంతో..



ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌సీలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు వస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తున్నారు. అదే రోజు మేము అక్కడకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

– జి.అప్పారావు పెదపూడి గ్రామం

ఓటీపీ అడిగితే చెప్పవద్దు

బిక్కవోలు: మీకు అమ్మఒడి వచ్చిందని, రైతు భరోసా డబ్బులు పడ్డాయనీ.. ఇంకా విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల పేర్లు చెప్పి కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేర్లతో కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పథకాల పేర్లతో ఫోన్లు చేసి ఓటీపీలు అడిగి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు కాజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఫోన్లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ఎప్పుడూ ఫోన్లు చేయరని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులు, ఓటీపీలను గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

గడప గడపకూ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

అనపర్తి: స్థానిక పాతవూరు బాపనమ్మ తల్లి గుడి, టీటీడీ కల్యాణ మంటపం ఏరియాలో సోమ, మంగళవారాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టుపార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి బాపనమ్మతల్లి ఉపాలయం వద్ద అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే గడప గడపకూ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతి ఇంటా సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుతుకులూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాల స్వర్ణయుగ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కుతుకులూరులో గ్రామ పరిధిలో ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, వారు పొందుతున్న లబ్ధిని తెలియజేశారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు గజమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతోపాటు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచామన్నారు. నాలుగేళ్ల సంక్షేమంతో గడప గడపకూ కార్యక్రమం ద్వారా సగర్వంగా ప్రజలకు చెంతకు వెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో పారదర్శకంగా పాలనను అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అవినీతిరహితంగా ప్రజలకు చేరవేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి,పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతమ్మ అమ్మిరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, వార్డు సభ్యుడు సబ్బెళ్ల రామారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయికృష్ణారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ప్రజా శ్రేయస్సే పరమావధిగా వలంటీర్లు సేవలందిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కుల, మతాలకు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందిస్తూ, గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తమ వంతు సాయం చేస్తూ వలంటీర్లు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– అనపర్తి/బిక్కవోలు

సొంత బిడ్డలా సేవలు



రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

గతంలో ఏ పథకం కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చినా ఎంతో దూరం వెళ్లాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. వలంటీర్ కె.శ్రావణి వచ్చి అన్ని విషయాలను చెబుతోంది. సర్టిఫికెట్లు, పథకాలకు ఆమె దగ్గరుండి దరఖాస్తు చేయిస్తోంది. కరోనా సమయంలో వలంటర్లు సొంత బిడ్డలా సేవలందించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యం బారిన పడి నేను రాజమహేంద్రవరం స్వతంత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడకు వచ్చి నా యోగ, క్షేమాలు తెలుసుకోవడంతోపాటు జూలై నెల పింఛను ఆసుపత్రికే తీసుకువచ్చి ఇచ్చింది.

–యర్రంశెట్టి లక్ష్మి, అనపర్తి

ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఊరట



ప్రభుత్వం మంజూరు చేసిన వెయ్యి రూపాయలను ఆకుల నాగమణికి అందిస్తున్న వలంటీర్ మణికంఠ

గత 2020–21లో కోవిడ్ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ విధించాయి. పనులకు వెళ్లక చేతిలో డబ్బులు లేక చాలా ఇబ్బంది పడ్డాం. ఇంట్లో సరుకులు లేక జీవనం అయోమయం అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వలంటీర్లు ద్వారా పేదలకు రూ. వెయ్యి ఆర్థిక సాయం అందించారు. వలంటర్లు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి సాయం అందించారు. మా వలంటీర్ కర్రి మణికంఠ ఆ వెయ్యి రూపాయలను అందించడంతో ఆర్థికంగా ఊరట పొందాం. ఆ రోజు వలంటీర్ చేసిన సేవను ఇప్పటికీ మర్చిపోలేను.

– ఆకుల నాగమణి, పందలపాక

నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చినకొండేపూడిలో గడప గడపకూ..



చినకొండేపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్లలో 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, నవరత్నాల పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చి నవశకానికి నాంది పలికారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం చినకొండేపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

రూ.9.53 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఈ గ్రామంలో టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.1.67 కోట్లతో అభివృద్ధి చేపడితే, గడిచిన నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.9.53 కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రూ.90 లక్షలతో సీసీ, గ్రావెల్ రోడ్లు, రూ.85 లక్షలతో సీసీ డ్రైన్లు నిర్మించామన్నారు. ఇప్పటికి రూ.65 లక్షలతో రెండు గ్రామ సచివాలయాలు, రూ 43.60 లక్షలతో రైతు భరోసా కేంద్రాలు, రూ.35 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి చేశామన్నారు. రూ.2 కోట్లతో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత

కౌలు రైతు చుండ్రు సుబ్రహ్మణ్య చౌదరి 2022 నవంబర్ 27న ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.7 లక్షల పరిహారం చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందించారు. కార్యక్రమంలో ఏడీపీ మల్లికార్జునరావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు, చిడిపి బంగారయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండు రాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, ముదునూరి ప్రసాదరాజు, మేడిశెట్టి చిన్నికృష్ణ, మద్దాల కొండలరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. కానేటి దుర్గయ్య, గుర్రాల శ్రీను, ఇజ్జిన బంగారు బాబ్జీ, గుర్రాల ప్రసాద్, కానేటి దుర్గాప్రసాద్, ధనకొండ దుర్గయ్యను అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,730 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రంగాపురంలో అక్రమంగా మద్యం కలిగిన పలివెల దుర్గ ప్రసాద్‌ను అరెస్టు చేసి, రూ.3,100 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మాచరమ్మ తల్లికి మొక్కు చెల్లింపు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిస్తే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి విందు భోజనాలు ఏర్పాటు చేసి మొక్కు చెల్లించకుంటానని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్, పద్మశాలీల సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు పెదపూడి గ్రామానికి చెందిన పప్పు సింహాచలం మొక్కుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పెదపూడిలో మాచరమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో కూర్చొని ఆ మొక్కును చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన విందు భోజనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా మాచరమ్మ తల్లి ప్రసిద్ధి గాంచిందన్నారు. ఈ అమ్మవారి ఉత్సవాలు భక్తులు మరింత వైభవంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పప్పు జోగరావు నాగమణి దంపతులు, సింహాచలం కల్పన అంజలి దంపతులు, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాకర సాయిబాబు, కోరా బాబి, పార్టీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై గ్రామీణులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రాజు

రంగంపేట: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం రాజు న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ బి.వెంకట్రాజు అన్నారు. ఆదివారం సింగంపల్లి గ్రామంలో రాజు న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో రంగంపేట మండల గ్రామీణ వైద్యులకు నరాలు, జీర్ణ వ్యవస్థ, గుండె వ్యాధులకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ వెంకట్రాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులే ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులు రాకుండా వ్యాయామం చేయాలని సూచించాలని వివరించారు. డాక్టర్ రఘువీర్ జీర్ణ వ్యవస్థకు సంబంధించిన విషయాలను, డాక్టర్ వినోద్‌కుమార్ గుండెకు సంబంధించిన విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎ. నాగేశ్వరరావు, తపోదర్, గోపి, రహీం, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి .. తినరా మైమరచి..

- రేషన్ బియ్యంతో పసందైన రుచులు
- రాజానగరంలో వంటల పోటీ
- 40 రకాల పదార్థాలతో సత్తా చాటిన మహిళలు



బహుమతులు అందిస్తున్న కమిషనర్ అరుణ్ కుమార్, కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎమ్మెల్యే రాజా



వంటకాలను రుచి చూస్తున్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

రాజానగరం: ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంతో రకరకాల వంటకాలు తయారు చేసి, వాటిని స్టాళ్లలో ఏర్పాటు చేశారు. వాటి రుచి చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అబ్బురపడ్డారు. వండుకుని తినేందుకు పనికిరావన్నట్టుగా కొందరు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించేందుకు సిద్ధమవుతున్నారు. అటువంటి వారిలో అవగాహన తీసుకువచ్చి, రేషన్ బియ్యంలో ఉన్న విలువలను, నాణ్యతను తెలియజేసే విధంగా రాష్ట్రంలో మొదటిసారిగా రాజానగరంలో మండల స్థాయిలో ఈ పోటీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ఆవరణలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన మహిళలు 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మునగాకు రైస్, కరివేపాకు రైస్, తాటి గారెలు, నువ్వుఅరిసెలు, మునగాకు ఉప్మా, పాలముంజులు, ఇలా.. సుమారు 40 రకాల వంటకాలను తయారు చేశారు. ఈ స్టాళ్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు సందర్శించారు. మహిళలు తయారు చేసిన వంటను రుచిని ఆస్వాదించారు.

అప్‌లోడ్ చేయించి, అవగాహన పెంచుదాం

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కోట్లాది రూపాయలు వెచ్చించి, రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ని చులకనగా చూడవద్దని, దీనిలో ఎన్నో పోషకాలు ఉన్నాయంటూ మహిళలు తయారుచేసిన ఈ వంటకాలను ఫొటోలు, వీడియోలు తీయించారు. వాటిని వీటిని సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిలో అప్‌లోడ్ చేసి, ప్రజలకు, వలంటీర్లకు చేరువయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ అరుణ్ కుమార్ తెలిపారు.

విజేతలకు బహుమతులు

వంటల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో విజేతలను ఎంపిక చేసి, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2500 చొప్పున సర్టిఫికెట్లతో పాటు అందజేశారు. ప్రథమ బహుమతిని నందరాడకు చెందిన జి.వేణు, వెంకటరత్నం (కరివేపాకు రైస్), ద్వితీయ బహుమతిని జి.యర్రంపాలెంకు చెందిన కె.లక్ష్మి, దుర్గకు (తాటిగారెలు), మూడో బహుమతిని కలవచర్లకు చెందిన తవ్వా లక్ష్మి, ముద్దాడ లక్ష్మి, వై.సుజాత, ఎస్.వెంకటలక్ష్మి (రవ్వ, పులిహోర, పాలముంజెలు) గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకంగా రూ.వెయ్యి చొప్పున స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సొంతంగా అందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, డీఎస్ఓ ఇన్‌చార్జి విజయ భాస్కర్, మార్కెటింగ్ డీఎం ఎ.కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.సుభాషిణి, డీఎల్‌డీఓ పి.వీణాదేవి, తహసీల్దార్ పవన్ కుమార్, ఎంపీడీఓ బి.రామారావు, జెడ్పీటీసీ వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, సర్పంచ్ కుందేటి ప్రసాద్, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, వేమగిరి కృష్ణ, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, సంగీత ప్రసాద్ పాల్గొన్నారు.